నకిలీ అల్లం పేస్ట్ తయారీదారు అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

- ముడి పదార్థాలు, పరిశ్రమ సీజ్
- వివరాలు వెల్లడించిన రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్లం, వెల్లుల్లి పేస్ట్ డబ్బాలు

సంగారెడ్డి, జూలై 13: నాసిరకం అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వ్యాపారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే దురాశతో కంది మండలం, జుల్కల్ గ్రామానికి చెందిన మహమ్మద్ వసీం తహ ఫుడ్స్ పేరుతో నాసిరకం అల్లం పేస్ట్ తయారు చేస్తున్నాడని సమాచారం వచ్చింది. దీనిపై ఈ నెల 4న సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్ గ్రామంలోని తహ ఫుడ్స్ పరిశ్రమపై దాడులు చేసి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీకి వినియోగిస్తున్న పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ నెల 12న మహమ్మద్ వసీం తయారు చేస్తున్న అల్లం, వెల్లుల్లి పేస్ట్ నాసిరకమని, తక్కువ ధరతో ముడి పదార్థాలను వినియోగించి, ఎలాంటి పరిశుభ్రత పాటించకుండా నాణ్యతలేని పేస్ట్‌ను తయారు చేసి అమ్ముతున్నట్టు స్పష్టం చేశారు. అలా తయారు చేసిన అల్లం పేస్ట్‌ను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తూ తప్పుడు మార్గంలో డబ్బు సంపాదిస్తున్నాడన్నారు. తయారీదారు వసీంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఆరోగ్యానికి హానికరమని, వ్యాపారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మొహమ్మద్ వసీంను అదుపులోకి తీసుకొని సుమారు 6 క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను, పరిశ్రమను సీజ్ చేశామని తెలిపారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

సంగారెడ్డి, జూలై 13: కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా శారీరక, మానసిక వృద్ధికి ఉచిత వైద్య శిబిరాలు తోడ్పతాయని కళశాల డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని గోకుల్ వెంకటేశ్వర, గౌతమి డెంటల్ దవాఖానల సంయుక్త ఆధ్వర్యంలో ఇష్ట కళశాలలో వైద్య శిబిరాన్ని డాక్టర్ శ్రీహరి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు జనరల్ హెల్త్ చెకప్, డెంటల్ చెకప్, మెంటల్ హెల్త్ ఎగ్జామినేషన్లను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో గోకుల్ దవాఖాన డైరెక్టర్ డాక్టర్ శ్రీహరి, రజచైతన్యలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలపై నిర్లక్ష్యపు నీడ

బ్రాహ్మణగూడ శివారులో నేలకొరిగిన తెలంగాణ క్రీడాప్రాంగణం బోర్డు

హత్నూర, జూలై 13: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆసక్తిగల యువకులు, ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు ఆడుకునేవారు. ప్రస్తుతం ఆధరణ లేక క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. క్రీడా వస్తువులు పాడైపోతున్నాయి. హత్నూర మండలం బ్రాహ్మణగూడ తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు కింద పడిపోయి రోజులు గడుస్తున్నా పట్టించుకునేవారులేక తుప్పుట్టిపోతుంది. ఇప్పటికైనా కిందపడ్డ క్రీడాప్రాంగణం బోర్డు సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీరప్ప బస్తీలో స్పెషల్ శానిటైజేషన్

బీరప్ప బస్తీలో మట్టి కుప్పలను చదును చేయిస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, జూలై 13: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది వార్డులోని రోడ్లను శుభ్రం చేశారు. రోడ్లపై అక్కడక్కడ పడిన గుంతలను మట్టి వేసి పూడ్చివేశారు. రోడ్డు పక్కన నిల్వచేసిన పెద్దపెద్ద మట్టి కుప్పలను జేసీబీ సహాయంతో చదును చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్‌రెడ్డి వార్డులో పర్యటించి సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు, సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలను స్వయంగా పరిశీలించారు. వ్యాధుల కాలం అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానికులు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

12 వార్డులో పరిసరాలు శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ నాగరాజు

అందోల్, జూలై 13: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు సూచించారు. శనివారం 12వ వార్డులో మున్సిపల్ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలతో పాటు కాలనీ పరిశుభ్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొహర్రం, బోనాల పండుగను దృష్టిలో పెట్టుకొని కాలనీలో పిచ్చి మొక్కలు తొలిగించడంతోపాటు మురికి కాల్వలను శుభ్రం చేయించినట్లు తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు.

బ్లాస్టింగ్‌లతో బెంబేలు

- మాదారం, రాళకత్వ క్వారీల్లో భారీ పేలుళ్లు
- ఇండ్లకు బీటలు.. దెబ్బ తింటున్న పంటలు
- కంకర క్రషర్లు, క్వారీలను పూర్తిగా తొలిగించాలని గ్రామస్తుల డిమాండ్
- అధికారులకు ఫిర్యాదులు
- సమస్య పరిష్కారానికి పోరాటాలు

జిన్నారం మండల పరిధిలో కంకర క్రషర్లు, క్వారీలు శక్తికి మించి భారీ పేలుళ్లు జరుపుతున్నాయి. దీంతో సమీపంలోని మాదారం, మంత్రికుంట, రాళకత్వ గ్రామాల ప్రజలు ఏండ్లుగా అవస్థలు పడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించుకున్న ఇండ్లకు పగుళ్లు రావడంతో కన్నీటి పర్యంతం అవుతున్నారు. తెల్లని రాతిపొడి గాలిలో కలిసి ఊరును కమ్మేస్తున్నది. ఈ గాలిని పీల్చిన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. క్వారీల సమీపంలోని పొలాల్లో సాగు చేయడం మానేశారు. చెరువు తూములు, కాల్వలకు పగుళ్లు వచ్చి నీళ్లు నిల్వ ఉండడం లేదు. మాదారం, రాళకత్వ గ్రామాల ప్రజలు కంకర క్రషర్లను శాశ్వతంగా మూసేయాలని పోరాటం చేస్తున్నారు. కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ, పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



మాదారంలో కంకర క్రష్షర్ నుంచి పైకిలేస్తున్న తెల్లని రాతి దుమ్ము

మాదారంలో బ్లాస్టింగ్‌లకు బీటలువారిన ఇంటి గోడ

జిన్నారం, జూలై 13: మండలంలోని మాదారం గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 210లో ఉన్న కంకర క్రషర్లు, క్వారీలతో మాదారం, మంత్రికుంట గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. వీటి నుంచి వచ్చే దుమ్ముతో పంటలు పండడం లేదు. గాలి పీల్చి అనారోగ్యాలకు గురవుతున్నారు. కష్టపడి ఇష్టంతో కట్టుకున్న ఇండ్లు బీటలు వారుతున్నాయి. సుమారు 20 ఏండ్లుగా క్వారీ పేలుళ్లు, క్రషర్ల దుమ్ముతో అవస్థలు పడుతున్నారు. ఇక క్వారీలు, క్రషర్లు గ్రామ పరిధిలో వద్దంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్న క్రమంలో మాదారం పరిధిలోని 210 సర్వేనంబర్‌లో కొత్తగా వంద ఎకరాల క్వారీ కోసం కొందరు దరఖాస్తు చేసుకోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కంకర క్రషర్లు, క్వారీలను శాశ్వతంగా మూసేయాలని పోరాటం చేస్తుంటే కొత్తగా క్వారీలో తవ్వకాల కోసం దరఖాస్తులు రావడంపై మండిపడుతున్నారు. గ్రామస్తులందరూ సమావేశమై క్రష్షర్లు, క్వారీలకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న వాటిని మూసివేసేందుకు పోరాటం చేస్తున్నారు. లీజు ముగిసిన రెండు క్వారీల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని అధికారులకు సాక్ష్యాలతో సహా అందజేశారు.

రాళకత్వలో..

రాళకత్వ గ్రామ పరిధిలో ఉన్న కంకర క్రష్షర్, క్వారీ పేలుళ్లతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేండ్ల క్రితం కొత్త క్రష్షర్ ఏర్పాటు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు వద్దని మూకుమ్మడిగా తెలిపారు. అయినా అక్కడ క్రష్షర్ ఏర్పాటు చేశారు. దీని నుంచి అవస్థలు అనుభవిస్తున్న క్రమంలోనే గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 286 అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండానే క్రష్షర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయంటూ గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వెంటనే క్రష్షర్ ఏర్పాటు పనులను ఆపాలని కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

శాశ్వతంగా మూసేయాలి

మాదారం పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 210లో ఉన్న క్రష్షర్లు, క్వారీలను శాశ్వతంగా మూసేయాలి. లీజు ముగిసినప్పటికీ రెండు క్వారీల్లో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి. కొత్తగా వంద ఎకరాల్లో క్వారీల కోసం దరఖాస్తులు వచ్చాయి. కొత్త వాటికి అధికారులు అనమతులు ఇవ్వొద్దు. ఉన్నవాటిని పూర్తిగా మూసేయాలి. మాదారం, మంత్రికుంట గ్రామాలను, ప్రజలను క్రష్షర్లు, క్వారీ పేలుళ్ల నుంచి కాపాడాలి. క్రష్షర్లు, క్వారీలకు వ్యతిరేకంగా గ్రామస్తులందరం పోరాటం చేస్తున్నాం. శాశ్వతంగా మూసేసేవరకు మా పోరాటం కొనసాగుతుంది. అధికారులు మా బాధను అర్థం చేసుకోవాలి.

- సురేందర్‌గౌడ్, మాదారం మాజీ సర్పంచ్

మూతపడేదాకా పోరాడుతాం

మాదారం గ్రామ పరిధిలోని క్వారీలు మూతపడేదాకా గ్రామస్తులతో కలిసి పోరాటం చేస్తూనే ఉంటాం. క్రష్షర్లు, క్వారీలకు వ్యతిరేకంగా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించాం. త్వరలోనే జిల్లా మంత్రిని కలుస్తాం. క్వారీలతో గ్రామాభివృద్ధి ఆగిపోతున్నది. వీటిని పూర్తిగా మూసేస్తేనే గ్రామానికి మేలు జరుగుతుంది. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. క్వారీలకు వ్యతిరేకంగా పోరాటానికి కార్యాచరణ చేపట్టాం. ఉన్న క్రష్షర్లు, క్వారీలను మూసేయాలి. కొత్త క్వారీలకు అనుమతి ఇవ్వొద్దు. మా డిమాండ్‌కు అనుకూలంగా రాకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా ఉద్యమాలు చేస్తాం.

- రాజుగౌడ్, మాదారం గ్రామ నాయకుడు

ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం

కంకర క్రష్షర్లు, క్వారీలపై చర్యలు తీసుకోవాలని మాదారం, రాళకత్వ గ్రామస్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. క్వారీలపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్, మైనింగ్ ఏడీ అధికారులకు ఉందని ఫిర్యాదుదారులకు తెలిపాం. రాత్రిపూట క్వారీల్లో పేలుళ్లను తగ్గించాలని సంబంధిత వ్యక్తులకు సూచించాం. క్వారీల లీజు ముగిసినా తవ్వకాలు ఆగడం లేదని మాదారం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తాం.

- ఎం.భిక్షపతి, తహసీల్దార్, జిన్నారం

తెల్లాపూర్‌లో జగన్నాథ రథయాత్ర

జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం, జూలై 13: తెల్లాపూర్‌లో జగన్నాథ స్వామి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో గేటెడ్ కమ్యూనిటీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లాపూర్‌లోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ నుంచి రాజపుష్ప రోడ్డు వరకు స్వామివారి రథయాత్ర సాగింది. స్వామివారి కీర్తనలు, భజనలు చేసుకుంటూ భక్తులు రథయాత్ర వెంట నడుచుకుంటూ వెళ్లారు. స్వామివారి రథయాత్రతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ మాట్లాడుతూ ఏటా రథయాత్రను నిర్వహిస్తున్నామని, గేటెడ్ కమ్యూనిటీవాసులు వేలాదిగా తరలి వచ్చి రథయాత్రలో పాల్గొన్నారని చెప్పారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

గుమ్మడిదల, జూలై 13: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. గుమ్మడిదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగేండ్లుగా విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో హెచ్ఎం సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన 9మందికి ఘనంగా వీడ్కోలు పలికారు. వారికి శాలువలు కప్పి పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, రాజరెడ్డి, రత్న, అజ్మతుల్లా, సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, స్వామి, రామచంద్రారెడ్డి, అనంతరెడ్డి, బుచ్చిరెడ్డి, శోభరాణి, సరోజ, ఇందిరా, జగన్నాధం, సందీప్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శంషాబాద్ రాజు

రామచంద్రాపురం, జూలై 13: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ శంషాబాద్ రాజు అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి గ్రామం 14వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ వార్డులో డ్రైనేజీ సమస్యల కారణంగా ముందుగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌లను వేసిన తర్వాత సీసీ రోడ్లు వేయిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్ల ఏర్పాటుతో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని తెలిపారు.

ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

నారాయణఖేడ్, జూలై 13: నారాయణఖేడ్ పట్టణంలోని వివిధ వార్డులో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షుడు మోహీద్ పటేల్ శనివారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను కలసి విన్నవించారు. ఈమేరకు సమస్యలను వివరించారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు, వీధి దీపాలు వెలగకపోవడం, తదితర సమస్యలతో 12 వార్డుల్లో ప్రజలు సతమతవుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బసవేశ్వర చౌక్ నుంచి రాజీవ్ చౌక్ వరకు, కూరగాయల మార్కెట్ వైపు రోడ్లపై వర్షం నీళ్లు నిలవకుండా డ్రైనేజీలను శుభ్రం చేయించాలన్నారు. ఆయన వెంట ఎంఐఎం ప్రధాన కార్యదర్శి మజర అమ్జద్ తదితరులు ఉన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు నిరంతర కృషి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

కోహీర్, జూలై 13: కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. శనివారం మండలంలోని దిగ్వాల్ ఫార్మా పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కార్మికుల మేలు కోసం నిరంతరం పని చేస్తామని, పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి గడువులోగా కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేస్తామన్నారు. కరోనా సమయంలో ఎక్కడా లేని విధంగా రూ.10,800 వేతన ఒప్పందం చేశామని గుర్తు చేశారు. కార్మికులు రిటైర్‌మెంట్ అయ్యే సమయంలో మంచి లాభాలతో బయటకు వెళ్లేందుకు చేయూతనందిస్తామని తెలిపారు. పరిశ్రమ లాభాల్లో కార్మికులకు వాటా సాధిస్తామని హామీనిచ్చారు. కార్మికుల పిల్లలకు కూడా పరిశ్రమలో ఉద్యోగావకాశాలు వచ్చేలా చూస్తామన్నారు. కార్మికుల మేలు కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పోరాడే శక్తి కేవలం సీఐటీయూకి మాత్రమే ఉందన్నారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించే గుర్తింపు సంఘం ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, రాంచందర్, మహిపాల్, రాజిరెడ్డి, పండురంగారెడ్డి, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

డంపుయార్డును మరోచోటుకు తరలించాలి

గాంధీనగర్ సమీపంలోని డంపు యార్డును చూపుతున్న కౌన్సిలర్ చంద్రయ్య

బొల్లారం, జూలై 13: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు గాంధీనగర్‌లో గల డంపుయార్డ్‌తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని కౌన్సిలర్ చంద్రయ్య జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించారు. శనివారం కలెక్టరేట్‌లో డంపుయార్డును మరోచోటికి తరలించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. డంప్‌యార్డ్ సమీపంలో నివసిస్తున్న ప్రజలు దుర్వాసన, దోమల బెడద, చెత్తను కాల్చివేస్తున్న సమయంలో దట్టమైన పొగతో సతమతమవుతున్నారని చెప్పారు. వార్డు ప్రజల ఇక్కట్లను గుర్తించి వెంటనే డంపు యార్డును మరోచోటికి తరలించాలని కోరారు.

వరుణుడి కోసం పాదయాత్ర

కడ్పల్ నుంచి పాదయాత్రగా వెళ్తున్న గ్రామస్తులు

సిర్గాపూర్, జూలై 13: మండలంలోని కడ్పల్ గ్రామస్తులు శనివారం వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. 11 గ్రామాలకు పాదయాత్ర చేపట్టారు. అంతకుముందు స్థానిక హనుమాన్ మందిరంలోని శివలింగానికి జలాభిషేకం చేశారు. ప్రత్యేక అభిషేక పూజలు చేసి వర్షం కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. నిండు బిందెలు ఎత్తుకొని, భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తూ కడ్పల్ మీదుగా సంజీవన్‌రావుపేట, కొండాపూర్, గంగాపూర్ తదితర గ్రామాల్లోని హనుమాన్ మందిరాల్లో జలాభిషేకం చేసి పుష్కలంగా వర్షాలు కురిపించాలని మొక్కులు సమర్పించారు.

పూజలు చేస్తున్న వేదపండితులు

సిద్ధి వినాయక ఆలయంలో పూజలు

న్యాల్‌కల్, జూలై 13: మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో శనివారం సతతధార పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. లోకకల్యాణార్థం ఆలయంలో వారం పాటు పూజా కార్యక్రమాలు ఉంటాయని వేదపండితులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలందరూ సుఖాసంతోషలతో గడపాలని ఆలయంలో సతతధార పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. తోగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ మహారాజ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింలు, మేనేజర్ కృష్ణ, వేదపండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను సాగు చేయాలి

కోహీర్, జూలై 13: ఉద్యాన పంటల సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని జహీరాబాద్ క్లస్టర్ ఉద్యాన శాఖాధికారి స్పందన అన్నారు. శనివారం మండలంలోని పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పందిరి రకం కూరగాయలతోపాటు అరటి, బొప్పాయి, జామ తోటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిన్నారం ఎస్ఐగా నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ

జిన్నారం, జూలై 13: జిన్నారం ఎస్ఐగా నాగలక్ష్మి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. సంగారెడ్డి ఉమెన్ పోలీస్ స్టేషన్ నుంచి జిన్నారానికి బదిలీపై వచ్చారు. ఇన్నాళ్లు జిన్నారం ఎస్ఐగా పని చేసిన విజయ్‌రావు అమీన్‌పూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ జిన్నారం మండల పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

స్కావెంజర్, వంట మనిషి పోస్టులకు ఆహ్వానం

రాయికోడ్, జూలై 13: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్కావెంజర్, వంట మనిషి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి దీపిక తెలిపారు. స్కావెంజర్‌గా పని చేసేందుకు 10వ తరగతి చదివి ఉండాలని, వంట మనిషిగా పని చేసేందుకు 7వ తరగతి చదివిన వారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుట్కా సప్లై చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సీజ్ చేసిన గుట్కా

అమీన్‌పూర్, జూలై 13: నిషేధిత గుట్కా సప్లై చేస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలో రాకేశ్ అలియాస్ రాజేశ్ తన బైక్‌పై గుట్కా, తంబాకు ప్రోడక్ట్స్‌ను కిరాణా షాపులకు సప్లై చేస్తుండగా సమాచారం మేరకు పట్టుకొని సుమారు రూ.25 వేల గుట్కాలను సీజ్ చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరి తెలిపారు.